RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 230 పేజీలు - 08 గురువారం 16 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

## - గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నాం

మా ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 9 టీఎంసిల నీటికి యత్నం

దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్రారంభించిన సిఎం రేవంత్





తొలి అక్షరం/మహబూబ్‌నగర్,జూలై 15:తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నామని, అందులో మంచివుంటే మరింత మెరుగ్గా ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వానికి పాలసీపెరాలసిస్ లేదని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీలను మరింత మెరుగుపర్చి ముందుకు తీసుకెళ్తున్నాం అని అన్నారు. 1994 నుంచి 2004వరకు చంద్రబాబునాయుడు, 2004 నుంచి 2014వరకు వైస్ రాజశేఖర్ రెడ్డి, 2014 నుంచి 2023డిసెంబర్ వరకుగత ప్రభుత్వాలు తీసుకువచ్చిన పాలసీలను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతప్రభుత్వాల మిగతా2లో...



## 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల

# ఎకానమీ లక్ష్యం

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15: రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు మిగతా2లో...

## కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

- సిసి రోడ్ల పనులకు బండి శంకుస్థాపన



తొలి అక్షరం/కరీంనగర్,జూలై 15: కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ మిగతా2లో...

## మేడిగడ్డపై కేంద్రం

# తీరు దారుణం


- ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై మండిపాటు
- పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా
- రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి
- సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి
- ఢిల్లీలో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 15: గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు మిగతా2లో...

## 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

- బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి



తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15: వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని మిగతా2లో...



## త్వరలో నామినేటెడ్

# పోస్టుల భర్తీ

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన

తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15: ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్స్ ÷నైల్ అని స్పష్టం చేశారు. మిగతా2లో...

## తెలంగాణలో సర్ నమోదు పక్రియ

గడువును అగస్ట్ 3 వరకు పొడిగించిన ఎన్నికల సంఘం



తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15: తెలంగాణలో సర్ నమోదు పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించింది. సెప్టెంబర్ 9 వరకు మిగతా2లో...

## కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

- కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పొంగులేటి

తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15: దిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకోకుండా ఫాంహౌస్‌కే ఆయన మిగతా2లో...



## చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ



# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పాలసీల్లో ఉన్న మంచి మేం కూడా ప్రోత్సహిస్తున్నాం.. మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ లు డీకే అరుణ,మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరరాజా అద్భుతమైన పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసిందని, 1983 లో అమరరాజా చిత్తూరు జిల్లాలో మొదటిసంస్థను ఏర్పాటు చేసిందన్నారు. అమర రాజా సంస్థ ఏర్పాటు చేసి 40 యేళ్లు అవుతోందన్నారు. అమర రాజా గ్లోబల్ సంస్థ.. అంటూ అమర రాజా కు దేశంలో పోటీ లేదన్నారు. చైనా, జపాన్, జర్మని, కొరియా లాంటి దేశాలనుఆదర్శంగా తీసుకుని అమర రాజా సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో చైనా ఈవీవెహికిల్స్ కు లీడర్ గా ఉంది.. ఈవీ లో చైనాతో అమర రాజా సంస్థ పోటీ పడిపనిచేస్తోంది.. కాలుష్యం వేగంగా విస్తరిస్తోంది.. వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయి.. ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు పడటం లేదు.. రైతులు ఇబ్బంది పడుతున్నారు.. కోవిడ్ తర్వాత వాతావరణంలోచాలా మార్పులు వచ్చాయని సిఎం అన్నారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.. కాలుష్య నియంత్రలోఈవీవెహికిల్స్అవసరం ఉంది.. దివిటిపల్లి అమర రాజా యూనిట్ లో 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు..ఇందులో 400 మంది మహిళా ఉద్యోగులు ఉండటంమహిళా సాధికారిత కు నిదర్శనం.. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా పాలసీలుతీసుకువస్తున్నాం.. ప్రస్తుతం దేశ జీడీపీలో5 శాతం తెలంగాణ వాటా గా ఉంది.. కాని నేను దీనిపైన సంతోషంగా లేను..

దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం.. 2034 నాటికి తెలంగాణను వన్ట్రిలియన్డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా ధ్యేయం అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్ కు మద్దతుగా ఉంటున్నాయి.. తెలంగాణనుక్యూర్, ప్యూర్, రేర్ గా విభజించిపాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం.. తెలంగాణ పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు ముఖ్యం.. పారదర్శకంగా విధానాలు రూపొందించుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.. ఢిల్లీకి రాజు అయినా తల్లికి బిడ్డ అన్నట్లు గా నేను పాలమూరుబిడ్డను. ఆదర్శవంతంగా జిల్లా గా మహబూబ్నగర్ ను తీర్చిదిద్దుతున్నాం.. ఒకప్పుడుకరువు జిల్లాగా ఉండే మహబూబ్నగర్ ఇప్పుడు ఇతరజిల్లాలనుదత్తత తీసుకునే స్థాయికి ఎదిగాం.. విద్య లో భాగంగా ట్రిబుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు,ఏటీసీసెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ జిల్లాలో ఏర్పాటు చేశాం.. బ్లూ కాలర్ జాబ్ ల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ లు ఏర్పాటు చేస్తున్నాం.. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, బీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.. త్వరలోనే మహబూబ్‌గర్ జిల్లా ప్రజలకుశుభవార్త వినిపిస్తున్నాం. పక్క రాష్ట్రంతో సంప్రదింపులుజరుగుతున్నాయి.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీ లు సాధించే దిశగాచర్చలుజరుగుతున్నాయి.. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపుల పై చర్చలుజరుపుతున్నాం.. పరిశ్రమలకు అనుకూల వాతావరణంసృష్టించి జిల్లా లో ఉపాధి అవకాశాలుకల్పిస్తాం.. పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు అమర రాజా కు భూములు ఇచ్చారు.. అత్యధిక ఉద్యోగాలు వాళ్లకుఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బీ మినిస్టర్ గా గల్లాజయ్ దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్ లో చాలా రోడ్లు మంజూరు చేశారు.. నేను రెండో సారి గెలవడానికి నాకు అవి ఉపయోగపడ్డాయని రేవంత్ అన్నారు.

# 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతా మని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు దిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఎ÷-లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది. మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు. మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా? చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం. అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. సీసీఐని పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్ధరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# బోనాల జాతరలో హస్తకళా మేళా

## - 16 నుంచి హైదరాబాద్ హెచ్ఎండిఎ గ్రౌండ్‌లో ప్రదర్శన



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15:** ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈనెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ,వాకిటి శ్రీహరి , బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి.హెచ్. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత , పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని కోరారు.

# కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో యూడీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ మంకమ్మతోటలో రూ. 98లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా భాజపా పని చేస్తోందన్నారు. కరీంనగర్ నగరాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని.. మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

# తెలంగాణలో సర్ నమోదు ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాల స్వీకరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించింది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది. అనేక జిల్లాలో సర్‌పై అవగాహన లేక మందకోడిగా కొనసాగుతుండగా గడువు సమీపిస్తుండడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి దీంతో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగింపును ప్రకటించింది. అర్హత తేదీగా అక్టోబర్ 1వ తేదీ నాటికి ఓటర్ల వివరాల సవరణను పరిగణనలోకి తీసుకుంటూ నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను సైతం అధికారులు ఆగస్టు 3 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన అనంతరం, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు , తప్పుల మార్పులు-చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార ప్రక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానిక గా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

# చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ

**తొలి అక్షరం/హైదరాబాద్ ,జూలై 15:** బలహీనపడిన నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజుకోనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో మార్పుల వల్ల సముద్రపు గాలులు బలంగా వీస్తూ దట్టమైన మేఘాలు అలుముకోనున్నాయని పేర్కొంది. రెండు, మూడు రోజుల్లో ఇది అల్పపీడనంగా మారి ఒడిశా, బెంగాల్ తీరాల వైపు పయనించి, తూర్పు భారతదేశంలో వర్షాలు కురిపించనుందని వెల్లడించింది. జులై 19 వరకు తెలంగాణలోని ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, గురువారం జోరందుకుంటాయని అంచనా వేసింది.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

● కేంద్రంతో నిరంతర సంప్రదింపులు ● ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాల తరలింపు ● ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల చర్చ



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 15 :** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యా చరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటం తో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ఈ న్యాయ పరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు.

# చౌటుప్పల్‌లో ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ధర్నా

### వలిగొండ రోడ్డు జాప్యం, అక్రమ నిర్మాణాలు, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై తీవ్ర విమర్శలు







**తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 15:** మునుగోడులోని చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాజీ శాసనసభ్యులు, మునుగోడు నియోజకవర్గ సీనియర్ నాయకులు శ్రీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వలిగొండ రహదారి నిర్మాణంలో జరుగుతున్న తీవ్ర జాప్యం, కల్వర్టు నిర్మాణం, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, బ్రిడ్జి పనుల్లో నిర్లక్ష్యం, ట్రాఫిక్ సమస్యలు, స్థానిక ప్రజల ఇబ్బందులపై ఆయన ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను తీవ్రంగా విమర్శించారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వలిగొండ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన అనుమతులు సాధించి పనులు వేగంగా జరిగేలా కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నిర్లక్ష్య వైఖరి కారణంగా పనులు పూర్తిగా మందగించాయని, దీంతో ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాలువపై నిర్మిస్తున్న కల్వర్టులో కేవలం మూడు వెంట్లు మాత్రమే ఏర్పాటు చేయడం సరికాదని, భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పరిసర కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మూడు వెంట్లకు బదులుగా కనీసం ఆరు వెంట్లతో కల్వర్టు నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. కాలువకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ ఒక పుర కౌన్సిలర్ 200 గజాలకు మాత్రమే అనుమతి తీసుకుని దాదాపు 500 గజాల్లో భారీ భవన నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌కు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రజల ఫిర్యాదులను అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తూ అక్రమ వసూళ్లు, భూ ఆక్రమణలు, అవినీతి కార్యకలాపాలు, అక్రమ కట్టడాలకు ప్రోత్సాహం ఇస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇలాంటి చర్యల వల్ల చౌటుప్పల్ అభివృద్ధి దెబ్బతింటోందని, ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని అన్నారు. చౌటుప్పల్‌లో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనుల కారణంగా ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం కలుగుతోందని, సర్వీస్ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందన్నారు. కొన్ని చోట్ల డ్రైనేజీ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రజా సమస్యల కంటే మంత్రి పదవిపైనే ఎక్కువ దృష్టి ఉందని, గత 15 సంవత్సరాలుగా మునుగోడు నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి తీసుకురాలేకపోయారని విమర్శించారు. ప్రజల కష్టాలను విస్మరించి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్‌కు అధికారాలు లేకుండా చేసి డమ్మీగా మార్చారని, ప్రజా ప్రతినిధులకు తగిన అధికారాలు ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్ర మాలను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. చివరిగా వలిగొండ రహదారి నిర్మాణం, కల్వర్టు, బ్రిడ్జి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రభుత్వ భూములపై జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, చౌటుప్పల్ అభివృద్ధిని పారదర్శకంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# విద్యుత్ లేక ప్రారంభానికి నోచుకోని తంగడపల్లి పీహెచ్‌సీ వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి

### ఎండి జహంగీర్ సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి




**తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 15:** చౌటుప్పల్ మండలం తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించిన ఆయన, అక్కడి వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నూతన భవనం నిర్మించినప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి నోచుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్న జహంగీర్, కేవలం విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడటం దురదృష్టకరమన్నారు. వెంటనే విద్యుత్ కనెక్షన్ కల్పించి, అవసరమైన వైద్యులు, సిబ్బంది, ఔషధాలు, వైద్య పరికరాలను ఏర్పాటు చేసి ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తంగడపల్లి, పరిసర గ్రామాల ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకే దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని, పీహెచ్‌సీ ప్రారంభమైతే వేలాది మంది గ్రామీణ ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గోశిక కరుణాకర్, బత్తుల దాసు, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, చికూరి ఈదయ్య, కనకయ్య, సిలువేరు జంగయ్య, రాములు, ఎండి జావిద్, స్వామి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ముత్యాలు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు బొబ్బల రవీందర్ రెడ్డి వినతిపత్రం



**తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 15:** తెలంగాణ రాష్ట్ర గిరిజన, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొబ్బల రవీందర్ రెడ్డి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొబ్బల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, చిన్ననాటి నుంచి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను నమ్మి పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, పార్టీ అధికారంలోకి రావడంలో తన వంతు పాత్ర పోషించానని పేర్కొన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన తన సేవలను గుర్తించి వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించాలని మంత్రిని కోరినట్లు వెల్లడించారు. దివ్యాంగులు, పేద కుటుంబాలు, నిరుపేద విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ సామాజిక సేవలో ముందుండే నాయకుడిగా రవీందర్ రెడ్డి గుర్తింపు పొందారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఆయన చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రవీందర్ రెడ్డి పార్టీ కోసం చేసిన సేవలను ప్రశంసిస్తూ, ఆయన వినతిని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాస్, ఎస్. కుమార్, డి. రామచంద్ర, బండ శివకుమార్, బొబ్బల అక్షయ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి: హైకోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట జూలై 15:** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అందుకు గురువుల సహకారం చదువులో తప్పక అవసరమని గురువు లేని విద్య గుడ్డి విద్య అని, క్రమశిక్షణ పట్టుదల తో బాగా చదువుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకొని తల్లిదండ్రులకు ఊరికి ఎంతో పేరు తెచ్చిన వారవుతారని ప్రముఖ హై కోర్టు న్యాయవాది మిర్యాల రవీందర్ వారి సతీమణి జడ్చర్ల డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ గంజి సుకన్య అన్నారు. మునిపంపుల వాస్తవ్యులు మిర్యాల రవీందర్ తల్లిదండ్రులు మిర్యాల హరి గోవింద్ - జయ లక్ష్మీ సౌజన్యం తో మునిపంపుల ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు 700 నోటు పుస్తకాల ను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్య అతిథి సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం మాట్లాడుతూ ఉత్తమ పౌరులు గా రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమని విద్యార్థులకు సూచించారు. మునిపంపుల లో చదువుకున్న ఉన్నత స్థాయిలో ఉన్నవారు మన విద్యార్థుల కోసం ఇలా ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు . పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి మాట్లాడు తూ పాఠశాల అభివృద్ధికి ఇంకా 4దాతలు ముందు కు రావాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం రవీందర్ దంపతులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి, ఏ ఏ పీ సి చైర్మన్ బతిని వెంకటమ్మ, వార్డ్ మెంబర్ యదాసు లక్ష్మణ్, సేవా భారతి సంస్థ చైర్మన్ మన్నే పద్మా రెడ్డి, మాజీ సర్పంచ్ యదాసు యాదయ్య, మాజీ ఎంపీటీసీ గాదె పారిజాత, పాఠశాల టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.



# నీటి సంరక్షణే భవిష్యత్‌కు భరోసా

- జడ్పీహెచ్‌ఎస్ తంగడపల్లిలో 'జల సంవాద్' అవగాహన కార్యక్రమం
- ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్





**తొలి అక్షరం/చౌటుప్పల్,జూలై 15:** జాతీయ జల మిషన్ 'జల్ శక్తి అభియాన్ క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం తంగడపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 'జల సంవాద్' (నీటిపై చర్చ) కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో 'జల ప్రతిజ్ఞ' చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి నిల్వ, ఇళ్లలో నీటి వృథాను అరికట్టడం, సింటెక్స్ ట్యాంకులు నిండగానే మోటార్లు ఆపివేయడం, సంప్‌లు నిండిన వెంటనే వాల్వ్‌లు మూసివేయడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ సందేశాన్ని తమ తల్లిదండ్రులకు చేరవేసి నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, పీఈటీ లింగయ్య, ఉపాధ్యాయులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, టీపీబీఓ సాయి కుమార్, జూనియర్ అకౌంటెంట్ శ్రీనాథ్, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మొబైల్‌ను అందజేసి నిజాయితీని చాటుకున్న అధ్యాపకుడు



**తొలి అక్షరం/రామన్నపేట జులై 15:** నల్లగొండ నుండి భువనగిరికి బయలుదేరుతున్న బస్సులో ఉదయం 9 గంటల ప్రాంతంలో చిట్యాల ప్రాంతానికి చెందిన చంద్రు అనే వ్యక్తి తన మొబైల్ ను మరచిపోగా అదే బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేటలో పనిచేస్తున్న గ్రంథపాలకులు డాక్టర్ రాచమళ్ళ శ్రీనుకు లభించింది. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి వివరాలను ఆరా తీసి మరల ఆ వ్యక్తికి శ్రీను అందజేయడం జరిగింది. వంద రూపాయలు దొరికితేనే ఎవరికీ చెప్పకుండా జేబులో వేసుకొని పోయే వ్యక్తులు ఉన్న ఈ రోజుల్లో సుమారు 15000 విలువ చేసే మొబైల్ లభించినప్పటికీ దానిని నిజాయితీగా మళ్లీ ఆ వ్యక్తికి అందజేయడం గొప్ప విషయమని పలువురు శ్రీనును అభినందించారు. అభినందించినవారిలో కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం, అధ్యాపకులు ఉన్నారు.

# గుడుంబాపై పలిమెల పోలీసుల ఉక్కుపాదం..

**- 5 లీటర్లు స్వాధీనం, 30 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**




**తొలి అక్షరం/మహాదేవాపూర్ జూలై 15:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం అప్పాజిపేట గ్రామ పరిధిలో పలిమెల పోలీసులు అక్రమ గుడుంబా తయారీపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, గుడుంబా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 30 లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. జిల్లా పోలీసు శాఖ అక్రమ గుడుంబా తయారీ, రవాణా, విక్రయాల నిర్మూలన కోసం చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా పలిమెల ఎస్ఐ శశాంక్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, అక్రమ గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా సేవించడం ఆరోగ్యానికి హానికరమని, ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం శంకుస్థాపన కార్యక్రమం



**తొలి అక్షరం/రామన్నపేట జులై 15:** రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం శంకుస్థాపన చేయడం జరిగింది పల్లివాడ గ్రామ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు ఉపసర్పంచ్ పావురాల మచ్చ గిరి వార్డు మెంబర్లు దండిగ పాండు గట్టు ఉపేందర్ స్థలదాత సయ్యద్ ఖాజా బాబు గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కడారి సత్తయ్య మాజీఉప సర్పంచ్ కల్లూరి నాగేష్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు మంద చంద్రయ్య యువజన సంఘం అధ్యక్షులు మల్లెపాక నరసింహ యువజన సంఘం పెద్దలు మేకల లచ్చయ్య మేడి మల్లేశం కర్రే స్వామి కర్రే శ్రీనివాసు మేకల లింగయ్య జనపాల లక్ష్మణ్ సింగపంగ నరసింహ జనపాల స్వామి గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది స్థలదాత సయ్యద్ కాజా బాబు కి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

# వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనర్సింహని కలిసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 15:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నుండి హైదరాబాద్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు సిలారపు దామోదర రాజనర్సింహా ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన చాంబర్లో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆసుపత్రిలో సదుపాయాల అభివృద్ధి, సిబ్బంది నియామకం, వైద్యుల పని తీరు వంటి అంశాల గురించి మంత్రివర్యులు రాజనర్సింహా తో చర్చించి వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది అన్నారు. అలాగే ఆసుపత్రిలో పలు అధునాతన వైద్య పరికరాలు ఏర్పాటు గురించి ప్రత్యేకంగా మంత్రి ని కోరడం జరిగిందని పేర్కొన్నారు.

# ఘనంగా బక్కి అశోక్‌ని సన్మానించిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి





**తొలి అక్షరం/నెక్కొండ జూలై 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా అధికారికంగా ప్రకటించిన సందర్భంగా బక్కి అశోక్ ని శాలువా తో సత్కారం చేసిశుభాకాంక్షలు తెలియచేసిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడియా తిరుమల్, నెక్కొండ సొసైటీ చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి,సూరిపల్లి చైర్మన్ మాదాటి శీనువాస్, రెడ్లవాడ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఇదునూరి సాయికృష్ణ సొసైటీ డైరెక్టర్స్ కేవీ సుబ్బారెడ్డి కదురు సాంబయ్య,మట్టా వెంకటయ్య మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి బొమ్మేరాబోయిన రమేష్ ఎన్ ఎస్ యు ఐ వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్ నాయక్, సింగం అరుణ్ బూర్గు నరేష్,తొపనపల్లి సర్పంచ్ చాగంటిమమత -తిరుమల్,గొట్లకొండ సర్పంచ్ భూక్యా జనార్ధన్,తొపనపల్లి మాజీ సర్పంచ్ ఫకీర్ భాయ్ సొసైటీ డైరెక్టర్ వంగాల నాగిరెడ్డి, వార్డ్ సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్ బానోత్ రవికుమార్ కదురు జగన్ కక్కెర్ల ఐలయ్య ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు ఉషిల్లపాటి సురేష్ బొల్లెబోయిన సురేష్ నాదెండ్ల ప్రసాద్ పోరండ్ల రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజెటి బిక్షపతి జన్మదిన వేడుకలు



**-శుభాకాంక్షలు తెలియచేసిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి.**

**- మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి.**

**- నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్.**



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజెటి బిక్షపతి, జన్మదిన వేడుకలు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. వారికీ కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన టీపీసీసీ సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి,నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి , భక్కి అశోక్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడియా తిరుమల్, నెక్కొండ సొసైటీ చైర్మన్ చల్లా శ్రీపాల్ రెడ్డి, సూరిపల్లి చైర్మన్ మాదాటి శీనువాస్, రెడ్లవాడ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, పట్టుణ అధ్యక్షులు ఈదునూరి సాయికృష్ణ, సొసైటీ డైరెక్టర్స్ కేవీ సుబ్బారెడ్డి, కదురు సాంబయ్య, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,బొమ్మేరబోయిన రమేష్,సింగం అరుణ్,బూర్గు నరేష్, తొపనపల్లి సర్పంచ్ చాగంటి మమత-తిరుమల్, గొట్లకొండ సర్పంచ్ భూక్యా జనార్ధన్, తొపనపల్లి మాజీ సర్పంచ్ ఫకీర్ భాయ్, సొసైటీ డైరెక్టర్ వంగాల నాగిరెడ్డి, వార్డ్ సభ్యులు ముద్రబోయిన శ్రీకాంత్, కక్కెర్ల ఐలయ్య,నాదెండ్ల ప్రసాద్ పోరండ్ల రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలను పణంగా పెట్టి వెలుగులు పంచుతున్న పంచాయతీ సిబ్బంది

**- ఎత్తైన విద్యుత్ స్తంభాలపై వీధి దీపాల మరమ్మతులు. గ్రామస్థుల ప్రశంసలు**

**తొలి అక్షరం/నెక్కొండ జూలై 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని పలు గ్రామాల్లో రాత్రివేళ ప్రజలకు వెలుగులు అందించేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఎత్తైన విద్యుత్ స్తంభాలపైకి ఎక్కి వీధి దీపాల మరమ్మతులు, బల్బుల మార్పిడి వంటి పనులు చేస్తున్న తీరు స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ క్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది కాశబోయిన కృష్ణమూర్తి, చెరుకు ప్రభాకర్ అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వీధి దీపాలను పనికర గ్రామంలో మరమ్మతు చేస్తూ ప్రజలకు నిరంతర వెలుగులు అందించేందుకు కృషి చేస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, ఎత్తైన స్తంభాలపై పని చేయడం ఎప్పుడూ సవాలుతో కూడుకున్నదేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చిన్నపాటి పొరపాటు జరిగినా తీవ్ర ప్రమాదం సంభవించే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ



ప్రజల సౌకర్యమే లక్ష్యంగా సిబ్బంది తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వారి సేవలను ప్రభుత్వం, ఉన్నతాధికారులు గుర్తించి ప్రోత్సహించాలి. అవసరమైన భద్రతా పరికరాలు, ఆధునిక సామగ్రి అందుబాటులో ఉంటే వారు మరింత సురక్షితంగా విధులు నిర్వహించగలరు" అని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంలో గ్రామపంచాయతీ సిబ్బంది పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని, తెర వెనుక వారి కష్టాన్ని గుర్తించడం సమాజం బాధ్యత అని పలువురు పేర్కొన్నారు.



# మోత్కులగూడలో అభివృద్ధి పనులకు శ్రీకారం.. బీటీ రోడ్డు ప్రారంభం, సీసీ రోడ్లు డ్రైనేజీకి శంకుస్థాపన



**మోత్కులగూడకేసారం రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శ్రీకారం**

**గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి..**

**మోత్కులగూడలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం**

**తొలి అక్షరం/నందిగామ,జులై 15:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని మోత్కులగూడ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో డీఎంఎఫ్‌టీ నిధులతో రూ.5.50 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.5.50 లక్షలు, మోత్కులగూడకేసారం మధ్య రూ.1.60 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అలాగే ఫరూక్‌నగర్‌ఈదులపల్లి మార్గంలో రూ.5.60 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు ఎంఎంఆర్ గ్రాంట్స్ ద్వారా నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభి వృద్ధికి రాష్ట్ర





ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను ప్రగతి పథంలో నడిపిస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్లలో గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. పారదర్శక పాలనతో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, చేపట్టిన పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పనులు పూర్తైతే గ్రామంలో రవాణా, పారిశుద్ధ్య సమస్యలు గణనీయంగా తగ్గి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీఓ చక్రధర్ గౌడ్,మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మోత్కుల సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్, సర్పంచులు కొమ్ము కృష్ణ, బుగ్గ సాలయ్య, మల్లేష్, గొర్లపల్లి అశోక్, మంకాల శ్రీశైలం, ఈదులపల్లి మాజీ సర్పంచ్ స్వామి, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి,డైరెక్టర్ నరసింహులు గౌడ్, మోత్కుల గూడ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జెట్టరాజు, మాజీ సర్పంచ్ వానరాసి ఎల్లమ్మ, నర్సింలు, శంకరయ్య, హరీష్ , మహేందర్ ,నాయకులు పసుల బుచ్చయ్య, ధరూర్ సతీష్ పటేల్, ఆవుల మంద శివశంకర్,ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు,కావలి కృష్ణ, అన్వర్ పాష, గుండాల వేణు, చంద్రశేఖర్ గౌడ్, గును గూర్తి నవీన్ గౌడ్, సీతారాం, సత్యనారాయణ గౌడ్, రాఘవేందర్ గౌడ్, మాణిక్యం, ప్రభు, చిందం నర్సింలు, పిట్టల రాములు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విభజన హామీలు అమలు చేయడంలో విఫలమైన బిజెపి సర్కార్

### అక్రమ కేసులు ఎత్తివేయాలి

### బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి... ఎంపీ పోరిక బలరాం నాయక్





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 15:** విభజన హామీ అమలు చేయడంలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వం విఫలమైందని మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కోర్టుకు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపన ధ్యేయంగా చేసిన పోరాటంలో భాగంగా సిపిఐ కాంగ్రెస్ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు కోర్టుకు హాజరు. సందర్భంగా బలరాం నాయక్ మురళి నాయక్ బెల్లయ్య నాయక్ విజయ సారధి గౌని ఐలయ్య గుణగంటి రాజన్న నువ్వు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సర్కార్ విభజన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. 2014 ఉమ్మడి విభజన చట్టంలో ఉన్న బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిందే అన్నారు మోడీ ప్రభుత్వం నాణ్యత లేదని తెలంగాణ ను అవమానిస్తుందన్నారు బిజెపి ఎంపీలు మంత్రులు ఉండి కూడా తెలంగాణ కోసం మాట్లాడడం లేదన్నారు మోడీ సర్కార్ రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఢిల్లీ మోడీ వద్దకు వెళ్లి విభజన చట్టం హామీ కోసం అవసరమైతే రాజీనామా చేయాలన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున అన్ని పార్టీలను కలుపుకొని కేంద్రంలోని బిజెపి పై పోరు తప్పదని హెచ్చరించారు. కోర్టుకు హాజరైన వారిలో భూక్య ఉమా, శ్రీకాంత్ రెడ్డి, బి అజయ్ సారధి రెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, భరత్ చందర్ రెడ్డి, జిన్నా రెడ్డి వెంకటేశ్వర్లు, మూలగుండ్ల వెంకన్న, దసురు నాయక్, రాధా, పెరుగు కుమార్, సుచిత్ర, శంతన్ రామరాజు, మాధవి, స్వరూప, మనోజ్, వంశీ, శ్రీనివాస్, హరుణ్, కాంగ్రెస్ సిపిఐ న్యూడెమోక్రసీ సిపిఎం నేతలు కోర్టుకు హాజరైనారు.

---

# ప్రజాస్వామ్య బలోపేతానికి SIR ప్రక్రియను విజయవంతం చేయాలి: రాయికల్ శ్రీనివాస్

### • అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలి



**తొలి అక్షరం/ఫరూక్‌నగర్, జూలై 15:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాసు మల్లగూడెం గ్రామ సర్పంచ్ నత్తి శివరాములు ఆహ్వానం మేరకు గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు, వివరాల సవరణ, అవసరమైన ధ్రువపత్రాల సేకరణ ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమం పురోగతిని తెలుసుకుని, ఓటరు నమోదు ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రాయికల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు అని అన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. అదే సమయంలో గ్రామ ప్రజలు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, పేర్లు లేకపోయినా లేదా వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సవరణలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. SIR ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేస్తే ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందుబాటులోకి వస్తుందని, దీంతో ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

---

# ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### • సర్ ప్రక్రియను ప్రజలు విజయవంతం చేయాలి



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 15:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 12, 13, 14 వార్డులతో పాటు బూత్ నంబర్లు 227, 228, 231, 234లలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. బూత్‌ల వద్ద ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల నమోదు, వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్లు దిలీప్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్ఓలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# దళిత క్రైస్తవ గర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

### • రాజ్యాంగ హక్కుల సాధన సమితి మహబూబ్నగర్ జిల్లా సలహాదారులు మిట్టు టైటాస్,సురేందర్,డేవిడ్




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 15:** దళిత క్రైస్తవ గర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయగలరని రాజ్యాంగ హక్కుల సాధన సమితి మహబూబ్ నగర్ జిల్లా సలహాదారులు మిట్టు టైటాస్,సురేందర్,డేవిడ్ అన్నారు. బుధవారం నాడు షాద్ నగర్ పట్టణంలోని ఎం బి చర్చిలో క్రైస్తవ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17 వతేదీన మహబూబ్ నగర్ జిల్లాలోని జె జె ఆర్ ఫంక్షన్ హాల్ లో ఉదయం 11 గంటలకు నిర్వహించే దళిత క్రైస్తవ గర్జన భారీ బహిరంగ సభను జయప్రదం చేయగలరని వివరించారు. ఐక్యమత్యంతో కలిసి క్రైస్తువులంతా హక్కులు సాధించుకోవాలని తెలిపారు. క్రైస్తవ్యంలోకి మారిన ఎస్సిలకు ఎస్సి హోదా కల్పించాలని అన్నారు. అంతేకాకుండా నిత్యం క్రైస్తవులపైన నిరంతరం జరిగే దాడులను అరికట్టేందుకు చర్యలుతీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, ఎంపీ మల్లురవి, బిఆరెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్,సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ,ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ నాయకులు దేవయ్య,అభిషేక్ అబ్రహం, స్వామిదాస్,జోసఫ్ ఫ్రాంక్లిన్, తిమోతి,కృష్ణపాల్,ఐజాక్,రవితేజ, మల్లేష్,పీటర్,రవి,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు మల్లు రవి

### డాక్టర్ మల్లు రవికి ఘన జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు

### హైదరాబాద్‌లోని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

### పూలమాలలు, శాలువా, బొకేతో ఘన సన్మానం





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 15:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ మల్లు రవి 76వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మైనార్టీ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పొగాకు ప్రకాష్, ఫరూఖ్‌నగర్ యువ కాంగ్రెస్ నాయకుడు ముబారక్ అలీ ఖాన్, కొల్లూరు ఖాజా, చెన్నగల్ల జంగయ్య తదితరులు డాక్టర్ మల్లు రవిని పూలమాలలు, బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "పిలిస్తే పలికే నేతగా, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా డాక్టర్ మల్లు రవి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విశేష సేవలు అందించారు. కార్యకర్తల వెన్నంటే నిలిచి వారి శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేసే నాయకుడు మల్లు రవి" అని కొనియాడారు. మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మాట్లాడుతూ, డాక్టర్ మల్లు రవి రాజకీయ నాయకుడిగానే కాకుండా సామాన్య ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే ప్రజానాయకుడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, యువతకు ఆదర్శంగా నిలిచే నాయకుడని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, రైతు సంక్షేమం కోసం ఆయన విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ మల్లు రవి సంపూర్ణ ఆరోగ్యంతో, ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ ప్రజలకు మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

---

# వెల్‌జర్లలో సర్ కార్యక్రమానికి సర్పంచ్ ఆర్. బాబు నాయక్ చురుకైన సహకారం

### • ఇంటింటికీ తిరుగుతూ ఎన్యూమరేషన్ ఫారాలు నింపిస్తున్న సర్పంచ్

### • ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 15:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం లో భాగంగా వెల్‌జర్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియలో సర్పంచ్ ఆర్. బాబు నాయక్ చురుకుగా పాల్గొంటూ ఓటర్లకు సహకారం అందిస్తు న్నారు. వార్డుల వారీగా ఇంటిం టికీ తిరుగుతూ ఓటర్లను చైతన్యపరుస్తూ, ఎన్యూమరేషన్ ఫారాలు సక్రమంగా నింపేలా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్ ఆర్. బాబు నాయక్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి అత్యంత విలువైన ఆయుధమని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. ఎలాంటి అపోహలకు గురికాకుండా ఎన్నికల సంఘం సూచించిన విధానాలను అనుసరిస్తూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపే సమయంలో ఓటర్లకు ఎదురయ్యే సందేహాల ను నివృత్తి చేస్తూ, అవసరమైన వివరాలను అందించి దరఖాస్తులను పూర్తిగా, సక్రమంగా సమర్పించేలా సహకరి స్తున్నారు. గ్రామంలోని ప్రతి అర్హుడైన ఓటరు వివరాలు నమోదు అయ్యేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీపీఓ విష్ణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాంగారి జంగయ్య, కేవీఎం, బీఎల్‌ఏ వట్టెల మహేష్ యాదవ్, అఖిల్ గౌడ్, బీఎల్‌ఓలు జాంగారి అనూష, కావాలి సుజాత, కావాలి శమంత, గ్రామ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# టీ.ఎల్.పేటలో ఎస్ఐఆర్ ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు



**తొలి అక్షరం/ఏన్కూర్ జులై 15:** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూర్ మండలం టీ.ఎల్.పేట గ్రామంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.జే.సీ. కృష్ణ, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జున, వైరా నియోజకవర్గ నాయకులు గిరిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో సమావేశమై ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు తీరును సమీక్షించి పర్యవేక్షించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏన్కూర్ మండలం సీనియర్ నాయకులు యండార్తి మోహన్‌రావు, గిద్దగిరి సత్యనారాయణ, తిమ్మరావుపేట సర్పంచ్ గుగులోత్ సుమలత, టీ.ఎల్.పేట గ్రామ సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, ఉపసర్పంచ్ నామా వెంకయ్య, బీఎల్ఏ ఎస్కే ఖాసీం, గడం వెంకటేశ్వర్లు, పూర్ణకంటి నాగరాజు, మాదేని సాయి, భూక్య శివ, కోనపల్లి నరేష్, చల్లా కోటేశ్వరరావు, ఉపేందర్, బారపాటి వెంకటనారాయణ, లక్ష్మయ్య, రవి, భూక్య ధర్మా, కడియాల సుధాకర్, వినోద్, బాబూలాల్, జరపాల లింగ, అరెం కోటేష్, వాకడోత్ లక్ష్మణ్ నాయక్, ధారావత్ కృష్ణ, యేసుబాబు, రామస్వామి, ఇంజం దేవదాస్, నజీర్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

**సుగంధ తైలం పంటల ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చు: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 15:** ప్రత్యన్నామయ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి.మరియన్న, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఎలక్ట్రిసిటీ, ఎస్ఈ సంబంధిత అధికారులతో కలిసి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో (వర్షాభావం) పరిస్థితిల్లో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ముగ్గు చూపే విధంగా అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని వారికి అవగాహన కల్పించాలని సూచించారు, ప్రస్తుతం వాతావరణంలో వచ్చే మార్పుల ఎలినో ప్రభావం వలన వర్షాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నందున, రైతులు అధిక నీరు వినియోగించే పంటలకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, పంట మార్పిడి ద్వారా అధిక లాభాలు చేకూరే, ఆయిల్ పామ్, కూరగాయలు, పూలు, పండ్ల పంటలు సాగు చేయాలని అందుకోసం క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు రైతులకు పరిస్థితులను సవివరంగా వివరించి అవగాహన కల్పించాలని అన్నారు, జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువలు ,మేజర్ మైనర్ ప్రాజెక్టుల ద్వారా నీటి వనరుల వివరాలను సమర్పించాలని, పశువర్ధక శాఖ నుండి తీసుకోవలసిన చర్యలు షెడ్యూలు ప్రకారం కొనసాగించాలని, విబిజి రాంజీ పథకం ద్వారా జిల్లాలో పౌల్ట్రీ, ఫిష్ ఫార్మింగ్, సీడ్స్ తయారీ, తదితర కార్యక్రమాల పై అవగాహన కల్పించాలని, భూగర్భ జలాలను పెంపొందించడం కోసం నీటి కుంట, ఊట కుంట, చెరువు కుంట, ఇంకుడు గుంతలను నిర్మించాలని, నానో యూరియా పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు,పంట మార్పిడి ద్వారా నూతనంగా సుగంధ తైల పంటల నిమ్మ గడ్డి, సిట్రోనెల్ల సాగు తక్కువ నీటితో పండే పంట ప్రస్తుత ఎల్నినో పరిస్తుతలకు అనుకూలమైన బాహువార్షిక పంట సుగంధ తైల పంటలకు కోతులు, కుక్కలు, దొంగల బెడద లేదు, బై బ్యాక్ సౌకర్యం కలదు, మార్కెట్ లో విరివిగా డిమాండ్ ఉన్నదిరైతు ఉత్పత్తి సంఘాల ద్వారా నూతన పంటల సాగు జిల్లాలో తొలిసారిగా ఈ పంటల సాగు పై అవగాహన సుగంధ తైల పంటల సాగుపై వనపర్తి జిల్లాకు చెందిన అభ్యుదయ రైతులు వాంకుడోతు మోతిభాయి, వాంకుడోతు రాధాకృష్ణలచే నూతన గిరిజన రైతులకు అవగాహన పంట మార్పిడి ద్వారా నూతన పంటలైన సుగంధ తైల పంటల సాగు పై గ్రామీణ అభివృద్ధి, ఉద్యాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ మరియు ఉద్యాన అధికారుల సమక్షంలో అభ్యుదయ రైతులు శ్రీమతి వాంకుడోతు మోతిభాయి, వాంకుడోతు రాధాకృష్ణ, వనపర్తి జిల్లా వారి చే నూతన రైతులకు అవగాహన చేయడం జరిగింది. ఈ పంట ను ఒక్కసారి నాటితే నాలుగు నుండి అయిదు సంవత్సరాలకు దిగుబడి ఇచ్చే బహు వార్షిక పంట.ఈ పంటల సాగుకు నేల ఎంపిక, దుక్కి చేయుట, రకాల ఎంపిక, మొక్కలు నాటుట, నీటి పారుదల, ఎరువులు, కోత కోయుట, ప్రత్యేక పద్ధతిన నూనె తీయుట, మార్కెటింగ్, బై బ్యాక్ మొదలైన అంశాలను రైతులు వారి విజయ గాధ ద్వారా ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం పొందిన వివరాలను విపులంగా



తెలియజేయడం జరిగింది. ఒక ఎకరానికి 60 నుండి 80 లీటర్ల నిమ్మ గడ్డి నూనె దిగుబడి వస్తుంది. దీని ద్వారా ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం వస్తుంది. ఈ పంట నుండి నూనె తీసిన తర్వాత మిగిలిన పంట వ్యర్ధాలను వంట చేరుకుగా, బూడిదను పంటకు ఎరువుగా వాడవచ్చు.సుశీల ఆరోమాటిక్ కంపనికి చెందిన డైరెక్టర్ సుశీల జైస్వాల్ ఈ పంట సాగు ప్రాముఖ్యత, బై బ్యాక్ అగ్రిమెంట్, మార్కెటింగ్ మొదలైన అంశాలను గిరిజన రైతులకు వివరించారు. ఈ నిమ్మ గడ్డి, సిట్రోనెల్ల నుండి తీసిన ఆయిల్ ను ఔషధ, సౌందర్య సాధన పరిశ్రమలలో, ఆహార పరిశ్రమలలో, సబ్బులు, అగర్ వత్తులు, దోమల నివారణకు, పరిమళ కొవ్వొత్తుల తయారీకి, గృహాలలో, వసతి గృహాలలో, కార్లలో అన్ని రకాలుగా పరిశుభ్రతకు, సువాసనకు పరిమళంగా వాడుతారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వయం సహాయక సంఘాల నుండి అధ్యక్ష, కార్యదర్శులు, కొత్తగూడ, గంగారం మండలాలకు చెందిన రైతులు, గ్రామీణ అభివృద్ధి అధికారులు, సిబ్బంది, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి. మధుసూదన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్,జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, ఉద్యాన శాస్త్రవేత్త డా. ఎ. ప్రశాంత్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె. స్వరూప, కొత్తగూడ, గంగారం మండలాల మహిళా మండల సమాఖ్య అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు, వీరితో పాటు వ్యవసాయ సహాయ సంచాలకులు మురళి, ఉద్యాన అధికారులు ఎ.జె. శాంతి ప్రియదర్శిని, యం. స్రవంతి, డి.పి.యం ఎ. శ్రీకాంత్, ఎ.పి.యం.లు బి. బాబు, రవీందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

# షాద్‌నగర్ అభివృద్ధే నా ధ్యేయం..

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం
- 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ ఆధ్వర్యంలో.
- రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 15:** షాద్ నగర్ పట్టణంలోని ప్రతి వార్డులో మెరుగైన మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ 12వ వార్డులో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఫరూక్‌నగర్ అభివృద్ధికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే షాద్‌నగర్ పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ దిలీప్ కుమార్, రిజ్వానా బేగం, ముబారక్ అలీ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ఫరూక్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, తుపాకుల శేఖర్, నవీన్, గంగామోని సత్తయ్య, రవితేజ, సీతారాం, ప్రదీప్ ముదిరాజ్, బీఎల్‌ఓలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# సిఐటీయు నుండి ఏఐటీయుసియులకి చేరిక

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 15:** సీఐటీయూ నుండి ఏఐటీయూసీ లోకి చేరినట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి అజయ్ సారథి రెడ్డి తెలిపారు. బుధవారం సిఐటియు కార్మిక సంఘం నుండి ఏఐటీయూసీలో మహబూబాద్ జిల్లా కేంద్రంలోని సుమారు 40 మంది ఆర్టీసీ హెయిర్ బస్ డ్రైవర్లు క్లీనర్లు కార్మికులు చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు నూతనంగా చేరిన వారిని ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ లు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కార్మికుల కోసం హెయిర్ బస్ డ్రైవర్లు క్లీనర్ల కోసం ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు ఈ జిల్లా కేంద్రంలో వందలాదిమంది కార్మికులు ఏఐటీయూసీలో చేరుతున్నారన్నారు. అన్ని రంగాల కార్మికులు ఆశాలు అంగన్వాడీలు భవన నిర్మాణ కార్మికులు తాపీ కార్మికులు ఆశాలు సెకండ్ ఏఎన్ఎంలు తోపుడు బండ్లు చెరుకురసంబండ్లు గప్చుప్ బండ్లు వీధి వ్యాపారస్తులు అనేకమంది వందలాదిమంది కార్మికులు ఏఐటీయూసీలో చేరుతున్నారని వారి కోసం వారికి అండగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని ఒకవైపు కార్మికులకు అండగా ఉంటూ యాజమాన్యాలతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రేట్లు పెంచుతూ ముందుకు పోతున్నామని భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా కార్మికులకు ఏఐటియుసి ఉంటుందన్నారు ఈ సందర్భంగా సిఐటియు నుండి ఏఐటీయూసీ లో చేరిన హెయిర్ బస్ డ్రైవర్లు క్లీనర్లు మరియు కార్మికుల కోసం అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు చేరిన వారిలో దొంతు రవీందర్ గౌడ్ గడ్డం శ్రవణ్ కుమార్ రవీందర్ సంతోష్ సతీష్ రవికుమార్ వీరన్న వెంకన్న ఎలేందర్ బిక్షపతి హైమద్ యాకయ్య పవన్ నరేష్ రాజేష్ సురేష్ దసరు నాగేష్ చేరిండ్ల వారిలో ఉన్నారు ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్ ఆబోతు అశోక్ తదితరులు పాల్గొన్నారు AITUCలో చేరినసందర్భంగా మిఠాయి తినిపించుకొని సంబరాలు చేసుకున్నారుఇటీవల ఎన్నికల్లో 33 వ వార్డు లో హ్యాట్రిక్ విజయం సాధించి బి అజయ్ సారధి రెడ్డి ని 18 వ వార్డులో విజయం సాధించిన రే శపల్లి నవీన్ ని కార్మికులు ఘనంగా శాలువాతో సన్మానించారు.

# వరంగల్‌లో అట్టహాసంగా వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్

**మాస్టర్ జి డిగ్రీ & పీజీ కళాశాలలో కూడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రాండ్ ప్రమోషన్**

**విద్యార్థులు కేరింతలతో ఘనంగా జరిగిన వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ ప్రమోషన్**

**సామాజికవేత్తలు,ప్రొఫెసర్లు,అన్నివర్గాల ప్రముఖుల సమక్షంలో ట్రైలర్ & సాంగ్స్ రిలీజ్**

**17న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానున్న వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ**








**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ హంటర్ రోడ్ లోని మాస్టర్ జీ డిగ్రీ & పీజీ కళాశాలలో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ అట్టహాసంగా జరిగింది.కూడా మాజీ చైర్మన్,ఓబీసీ చైర్మన్ ఎస్.సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించారు.పలువురు సామాజికవేత్తలు,ప్రొఫెసర్లు,అధ్యాపకులు,అన్నీ వర్గాల ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థుల కేరింతల నడుమ ట్రైలర్ & సాంగ్స్ రిలీజ్ చేశారు.వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామానికి చెందిన ఆడబిడ్డ కోమలి మహేందర్ సాహసోపేతంగా ధైర్యం చేసి కుటుంబ నేపద్యమున్న సినిమా తీయడంతో వారిని శాలువతో సుందర్ రాజ్ యాదవ్ సన్మానించి అభినందనలు తెలిపారు.ట్రైలర్ & సాంగ్స్ రిలీజ్ చేసిన అనంతరం మాజీ కూడా చైర్మన్,ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్,వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ నిర్మాత కోమలి మహేందర్ మీడియా సమావేశం నిర్వహించారు.జానపద కళాకారునీ, సారంగదరియా పాటపాడిన కోమలి సినిమా తీయడం గర్వకారణమని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు.వరంగల్ ఆడబిడ్డ తీసిన వెంకట్రామయ్య గారి తాలూకా మూవీనీ అందరూ ఆదరించాలన్నారు.వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ విజయవంతం చేసే బాధ్యత వరంగల్ ప్రజల పైన ఉందనీ,మంచి కుటుంబనేపథ్యం ఉన్న వెంకట్రామయ్య గారి తాలూకా మూవీని ఆదరిస్తారని ఆశిస్తున్నానన్నారు.పిల్లల ఆశయాల గురించి ఒక తండ్రి తపనపడే మెసేజ్ తో పాటు ఒక రైతు కష్టం,భూమి విలువ ఈ మూవీలో తెలుస్తుందన్నారు.కుటుంబ సమేతంగా ప్రతి ఒక్కరూ వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ చూసి వరంగల్ ఆడపడుచును ఆదరించాలని కోరారు.వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ నిర్మాత కోమలి మహేందర్ మాట్లాడుతూ....ఈ సినిమా కోసం పెద్ద సాహసం చేశానని,కోమలి క్రియేషన్ బ్యానర్ తో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ తీసానన్నారు.చాలా మంచి ఫ్యామిలీ సినిమా,కుటుంబాన్ని నిలబెట్టుకోవాలనే మెసేజ్ తో ప్రేమకథ చిత్రాన్ని తీయడం జరిగిందన్నారు.ప్రతి ఒక్కరు కుటుంబ సమేతంగా గర్వంగా చూడవలసిన సినిమా అన్నారు.ప్రతి ఒక్కరు వెంకట్రామయ్య గారి తాలూకా సినిమా చూసి విజయవంతం చేయాలన్నారు.జూలై 17న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 60 థియేటర్లతో పాటు హనుమకొండ లోని శ్రీదేవి ఏషియన్ మాల్,కాజీపేట భవాని థియేటర్లలో రిలీజ్ కానుందనీ తెలిపారు..వరంగల్ ఆడబిడ్డ చేసిన ఈ ప్రయత్నాన్ని గెలిపిస్తారని మనసారా ఆశిస్తున్నానన్నారు.ఒక ఆడపిల్ల కన్నీటి కథ,ఒక తండ్రి పడే ఆవేదన సన్నివేశాలతో వెంకట్రామయ్య గారి తాలూకా మూవీ ఉంటుందనీ చెప్పారు.మాస్టర్ జీ కళాశాల వేదికగా గ్రాండ్ ప్రమోషన్ నిర్వహించినందుకు సుందర్ రాజ్ యాదవ్ కు నిర్మాత కోమలి మహేందర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ జీ డిగ్రీ & పీజీ కళాశాల జనరల్ సెక్రెటరీ అచ్యుత్ రాజ్,ఓబిసి ప్రధాన కార్యదర్శి,ప్రొఫెసర్ గడ్డం భాస్కర్,తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్,ప్రైవేట్ లెక్చరర్స్ ఫోరమ్ అధ్యక్షుడు గంగాపురం వేణు మాధవ్ గౌడ్,ఓబిసి సభ్యురాలు చిగుమల్ల మౌనిక,ప్రముఖ అడ్వకేట్ బండా వివేకానంద, పారిశ్రామికవేత్త గుండా శ్రీనివాస్,అధ్యాపకులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయన్న ఆశీర్వాదం తీసుకున్న మాచర్ల కుమారస్వామి





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** కేంద్రమంత్రి బండి సంజయన్న ను కరీంనగర్ మహాశక్తి ఆలయంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్న మాచర్ల కుమారస్వామి.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయన్న ఆశీర్వాదంతో బిజెపి సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు గా భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి నియామకం అయిన తర్వాత మొదటిసారిగా కరీంనగర్ లో బండి సంజయన్న ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.బిజెపి పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేంద్రమంత్రి సూచించారుఅనంతరం స్వీట్ తినిపించి శాలువతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం,భీమదేవరపల్లి,కోహెడ మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీరామోజు శ్రీనివాస్,జాలిగం రమేష్,బిజెపి సర్పంచ్ మహేష్ ఉపసర్పంచ్ ఐలయ్య,భద్రయ్య,శ్యామ్,సదానందం,సతీష్, జ్ఞానేశ్వర్,అర్జున్,వంశీ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు ఎస్పీని కలిసిన రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు

● మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి



తొలి అక్షరం/మల్లంపల్లి జూలై 15: ములుగు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపీఎస్‌ను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో మిల్లర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎస్పీకి అందజేసి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ, 202526 రబీ సీజన్‌లో ములుగు జిల్లాలో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యాన్ని ఓపెన్ స్టోరేజ్‌లలో నిల్వ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రక్రియలో పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కూడా ధాన్యాన్ని బలవంతంగా దిగుమతి చేయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బియ్యాన్ని కొనుగోలు చేయకపోవడం, ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ సౌకర్యం లేకపోవడం వల్ల మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ ధాన్యం నాణ్యత తగ్గిపోవడంతో పాటు డిస్కలరేషన్, వెయిట్ లాస్ వంటి సమస్యలు తలెత్తి భారీ ఆర్థిక నష్టాలు వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా భవిష్యత్తులో మిల్లర్లు నష్టపోయి ప్రభుత్వానికి బకాయిలు పడే పరిస్థితి వస్తే, తమపై ఎలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయకుండా చూడాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. వినతిని స్వీకరించిన ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్ సానుకూలంగా స్పందించి, మిల్లర్ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాదం ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# బాత్రూమ్‌కు వెళ్లి అదృశ్యమైన మహిళ



తొలి అక్షరం/ఏటూరునాగారం, జూలై 15: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన రేగ శిరీష (28) అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 12వ తేదీ సాయంత్రం బాత్రూమ్‌కు వెళ్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీష తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త రేగ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఏటూరునాగారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శిరీష ఆచూకీ తెలిసిన వారు ఏటూరునాగారం సీఐ 8712670113, ఎస్ఐ 8712670090 లేదా ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ 8712670091కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నెంబర్ ప్లేట్ నిబంధనలు

# ఉల్లంఘిస్తే జైలుకే...

-మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

-ఒక్క రోజే 1,420 కేసులు నమోదు..రూ.2.92 లక్షల జరిమానా

-మూడోసారి దొరికితే చార్జ్‌షీట్.. కోర్టుకు రిమాండ్

Malkajgiri Commissionerate
Special Drive cases on Number Plate Violations, Dt: 15.07.2026

| S.No | Police station | Number plate violations | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | Contact Cases | | Non- Contact Cases | | Grand Total | | |
| | | Cases | Amount | Cases | Amount | Cases | Amount | Charge Sheet |
| 1 | Malkajgiri Tr PS | 95 | 24400 | 2 | 400 | 97 | 24800 | |
| 2 | Gopalpuram Tr PS | 130 | 24800 | 81 | 16200 | 211 | 41000 | 6 |
| 3 | Jawaharnagar Tr PS | 71 | 14200 | 1 | 200 | 72 | 14400 | |
| 4 | Trimulgherry Tr PS | 77 | 15000 | 41 | 8200 | 118 | 23200 | 2 |
| 5 | Alwal Tr PS | 78 | 14800 | 2 | 400 | 80 | 15200 | 5 |
| 6 | Begumpet Tr PS | 125 | 27800 | 269 | 53800 | 394 | 81600 | 4 |
| Zone- I | | 576 | 121000 | 396 | 79200 | 972 | 200200 | 17 |
| 1 | L.B Nagar Tr PS | 106 | 21000 | 0 | 0 | 106 | 21000 | 1 |
| 2 | Vanasthalipuram Tr PS | 73 | 14400 | 3 | 600 | 76 | 15000 | 1 |
| 3 | Uppal Tr PS | 117 | 24800 | 47 | 9400 | 164 | 34200 | 2 |
| 4 | Kushaiguda Tr PS | 43 | 10400 | 10 | 2000 | 53 | 12400 | |
| 5 | Ghatkesar Tr PS | 49 | 9400 | 0 | 0 | 49 | 9400 | 2 |
| Zone- II | | 388 | 80000 | 60 | 12000 | 448 | 92000 | 6 |
| Total | | 964 | 201000 | 456 | 91200 | 1420 | 292200 | 23 |

Sections:
Number Plate Violations - 80(A)APMVR,50,51 CMVR r/w 177 MVA

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై15: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ, ఫ్యాన్సీ,నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్లు అమరిస్తే కఠిన చర్యలు తప్పవని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. రోడ్డు భద్రతను పెంపొందించడం,నేరాలకు పాల్పడే వాహనాలను సులభంగా గుర్తించే లక్ష్యంతో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి (ఐపీఎస్) ఆదేశాల మేరకు కమిషనరేట్ వ్యాప్తంగా జులై 15న ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు.

### ఒక్క రోజే భారీగా కేసులు:

ట్రాఫిక్-1 డీసీపీ కె.రాహుల్ రెడ్డి (ఐపీఎస్), ట్రాఫిక్-11 డీసీపీ వి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు,ఎస్సై లు, ట్రాఫిక్ సిబ్బంది ఈ తనిఖీల్లో విస్తృతంగా పాల్గొన్నారు. నిబంధనల ప్రకారం హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (హెచ్ఎస్ఆర్పీ) లేని వాహనాలు, నెంబర్లు స్పష్టంగా కనిపించకుండా మార్పులు చేసిన వాహనాలపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఒక్క రోజే మొత్తం 1,420 కేసులు నమోదు కాగా, ఉల్లంఘునలకు రూ.2,92,200 జరిమానా విధించారు.

### మూడోసారి దొరికితే కఠిన చర్యలు:

నిబంధనలను పదే పదే ఉల్లంఘిస్తున్న వారిపై పోలీసులు మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ప్రథమ నిందితులతో పాటు, మూడోసారి కూడా తప్పుడు నెంబర్ ప్లేట్లతో పట్టుబడిన 23 మంది వాహనదారులపై చార్జ్‌షీట్లు దాఖలు చేసి కోర్టుకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. వాహనదారులు కేవలం గుర్తింపు పొందిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను (హెచ్ఎస్ఆర్పీ) మాత్రమే వాడాలి. ఫ్యాన్సీ లేదా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నెంబర్ ప్లేట్లను తక్షణమే తొలగించాలి. నిబంధనలు అతిక్రమిస్తే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. రోడ్డు భద్రత కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి. -డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), మల్కాజ్‌గిరి కమిషనరేట్.

# రూ.2.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని..

బాలసముద్రం,అడ్వొకేట్స్ కాలనీ,ప్రశాంత్‌నగర్‌లో రోడ్లు,డ్రైనేజీల అభివృద్ధికి శంకుస్థాపన..

రెండున్నరేళ్లలో వరంగల్‌కు పదేళ్ల కంటే ఎక్కువ అభివృద్ధి..

మామునూరు విమానాశ్రయం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం..

ప్రతిపక్షాలు అభివృద్ధిని అడ్డుకోవడం మానేసి సహకరించాలి: ఎమ్మెల్యే నాయిని







తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని,ప్రజలకు ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులో పూర్తి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 30వ డివిజన్ పరిధిలోని బాలసముద్రం,అడ్వొకేట్స్ కాలనీతో పాటు 61వ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ రోడ్ నంబర్4లో సుమారు రూ.2 కోట్ల 80 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు,మురికి కాలువలు,డ్రైనేజీలు,ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రతి అభివృద్ధి పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించి వాటిని పూర్తి చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలానికి ముందే అత్యధిక పనులను పూర్తి చేయడానికి అధికారులు, కాంట్రాక్టర్లతో సమన్వయం చేస్తున్నామని,మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో వరంగల్ జిల్లాకు గత పదేళ్లలో ఎన్నడూ రాని స్థాయిలో నిధులు,అభివృద్ధి కార్యక్రమాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. మామునూరు విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ,మాడవీధుల అభివృద్ధి,కాళోజీ కళాక్షేత్రం,ఖాజీపేట బస్‌స్టాండ్ అభివృద్ధి,ఆసుపత్రుల విస్తరణ వంటి అనేక కీలక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మామునూరు విమానాశ్రయం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.300 కోట్లు కేటాయించి భూసేకరణ పూర్తి చేయడం వల్లే కేంద్ర ప్రభుత్వం నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. దేశంలోనే కేంద్రం కోరిన వెంటనే భూసేకరణ పూర్తి చేసి విమానాశ్రయ నిర్మాణానికి సిద్ధం చేసిన అరుదైన ప్రాజెక్టుల్లో వరంగల్ ఒకటిగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వం భూసేకరణ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు స్వయంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉండి,రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసిన బీజేపీ నాయకులు అప్పట్లో వరంగల్‌కు విమానాశ్రయం ఎందుకు తీసుకురాలేకపోయారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకువస్తే దానిని తమ ఘనతగా చెప్పుకోవడం హాస్యాస్పదమని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే చిత్తశుద్ధి,జవాబుదారీతనం ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేదే కాదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో రోడ్లు,డ్రైనేజీలు,తాగునీటి సౌకర్యాలు,డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి గల్లీలో అభివృద్ధి కనిపించేలా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిపై ప్రతిపక్షాలు ఆధారాలు లేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని ఎమ్మెల్యే అన్నారు. ఇటీవల నిర్వహించిన భూ వేలం విషయంలో భారీ అవినీతి జరిగిందంటూ ప్రచారం చేసిన నాయకులు,వేలం పూర్తయ్యాక ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిరాధార ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు మానుకుని,వరంగల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,అధికారులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఓటు రక్షణే లక్ష్యం.. SIR2026లో ప్రతి ఓటరు సహకరించాలి

ఎన్యూమరేషన్ ఫారాలు జూలై 31లోగా సమర్పించండి : టీడీపీ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి చుండూరీ రాజారాజేశ్వరి విజ్ఞప్తి



తొలి అక్షరం/ఖమ్మం,జూలై15: ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్-2026 ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రతి ఓటరు సహకరించాలని తెలుగు దేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళ అధికార ప్రతినిధి చుండూరు రాజారాజేశ్వరి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాల మేరకు ఖమ్మంతో పాటు అన్ని ప్రాంతాల్లో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఖమ్మం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశారని తెలిపారు. ఇప్పటికీ ఫారాలు అందని ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ సమీపంలోని పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు లేదా సంబంధిత బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి ఫారాలు తీసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన ఫారాలను జూలై 31, 2026లోగా సంబంధిత బిఎల్ఓలకు తప్పనిసరిగా తిరిగి అందజేయాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, నిర్లక్ష్యం వల్ల ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని చుండూరీ రాజారాజేశ్వరి పిలుపునిచ్చారు. మీ ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు. ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకునేందుకు ఎస్ఐఆర్-2026 ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి అని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



తొలి అక్షరం/కురవి జూలై15: మండలం బుధవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎనుమురేషన్స్ ఫార్మ్స్ పంపిణీ చేయడం పూర్తి అయ్యిందని, డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి బూతు లెవల్ అధికారులు వెళ్లి వివరాలు సేకరించి 2002 ఓటరు జాబితా ప్రకారం వివరాలు సేకరించాలని, అందు బాటులో లేని వివరాలను గుర్తించాలని, వేగంగా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగాలని ఆదేశించారు, ఇప్పటికే జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు, అన్ని

## 23న నే జననాయగన్ విడుదలకు రెడీ




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

-------





## అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రాకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఐకాన్ అని రాసి ఉన్న క్యాప్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఒక్క పోస్టే ప్రస్తుతం టాలీవుడ్, మాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్‌కు అభిమానులు పెట్టిన బిరుదు కావడంతో, ఈ పోస్ట్ ఆయనతో చేయబోయే సినిమాపై పరోక్షంగా ఇచ్చిన హింట్ అని నెటిజన్లు భావిస్తున్నారు. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం చాలా రోజులుగా సాగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం ఇచ్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి'తో సూపర్ హీరో జానర్‌లో తన సత్తా చాటిన బసిల్ జోసెఫ్, 'శక్తిమాన్' కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించ బోతున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలను దర్శకుడు ఇప్పటికే ఖండించారు. బన్నీతో చేయబోయేది పూర్తిగా కొత్త కథేనని స్పష్టం చేశారు. కథ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై పూర్తి స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లే ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యాక దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాతే బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అట్లీ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రం కాగా, లోకేష్ మూవీ 23వ చిత్రంగా రానుంది. బసిల్ జోసెఫ్ ప్రాజెక్ట్‌ను అల్లు అర్జున్ తన 25వ చిత్రంగా ఎ÷–లాన్ చేస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.

## ప్రభాస్ అంటే ..మాంచి భోజనం గుర్తుకొస్తుంది




స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.



## వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా

### రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



## చరణ్ కోసం సుకుమార్ మాస్టర్ ప్లాన్..





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్‌సీ17'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రతి చిన్న విషయం కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సంచలన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ నయనతార ఓ అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.సుకుమార్ సినిమాల్లో కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా కథాగమనాన్ని మలుపు తిప్పే సహాయ పాత్రలు కూడా చాలా బలంగా, గుర్తుండిపోయేలా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే 'ఆర్‌సీ17' కోసం నయనతారకు ఒక పవర్‌ఫుల్ పాత్రను ఆయన డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె హీరోయిన్‌గా కాకుండా, కథకు వెన్నెముకగా నిలిచే పాత్రను పోషించనున్నారని సమాచారం. దక్షిణాదిలో అగ్రతారగా వెలుగొందుతున్న నయన్ ఎంట్రీతో ఈ సినిమాకు పాన్-ఇండియా స్థాయిలో మరింత బలం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఆమె నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రామ్ చరణ్ సినిమాలో కూడా ఆమె నటిస్తే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే సుకుమార్ ఈ సినిమా ఫైనల్ నెరేషన్‌ను రామ్ చరణ్‌కు వినిపించగా, ఆయన కథ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దేందుకు సుకుమార్ తన రచయితల బృందంతో కలిసి ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు తెలుస్తోంది. కథలోని భావోద్వేగాలు, పాత్రల మధ్య సంబంధాలను మరింత బలంగా తీర్చిదిద్దే పనిలో ఆయన నిమగ్నమైనట్లు సమాచారం. అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరిగితే, ఈ ఏడాది అక్టోబర్‌లో పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే 'పెద్ది' చిత్రంతో మరో బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్న రామ్ చరణ్, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. మొత్తం మీద 'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ అవుతుండటం, దానికి నయనతార లాంటి స్టార్ యాక్టర్ తోడవుతున్నారనే వార్తలు మెగా అభిమానుల్లో, సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక వివరాల కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.